# పండుగలు - ప్రాముఖ్యత

కూర్పు –శ్రీమతి స్వర్ణ సుధా అరుణశ్రీ

**"శుక్లాం బరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోప శాంతయే"**

సంవత్సరకాలంలో వచ్చే 12 తెలుగు నెలలలో వచ్చే ముఖ్యమైన పుణ్యదినాలు, పండుగలు వాటి విశేషాలు ప్రతినెలా ముఖ్యమైనదే.ప్రతి నెలలో వచ్చే పండుగలు వాటి ప్రాముఖ్యతను
ప్రాముఖ్యతను తెలియచేయగల సాహసం చేస్తున్నాను.

## ఆషాఢ మాస ప్రాముఖ్యత

శూన్యమాసం –ఉపనయనాలు, వివాహాలకి ముహుర్తాలు ఉండవు.ముందుగా ఆషాఢమాసం, కార్తీకమాసం, మార్గశిరమాసం,వైశాఖమాసం ఈ నాలుగు మాసాలను ఆకామవై మాసాలుగా వ్యవహరిస్తారు. చాతుర్మాస దీక్షగా వ్యవహరించి దీక్ష వహిస్తారు

ఆషాఢమాసం తొలి ఏకాదశి తో మొదలవుతుంది. ఆ రోజు శ్రీమన్నారయణునికి " పేలపిండి " నివేదన చేస్తారు. ఈ రోజు విష్ణుమూర్తి పాలసముద్రములో విశ్రాంతికై వెళతారు. తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు వైకుంఠానికి తిరిగి వస్తారు. తొలి ఏకాదశి నుండి మన పండుగలు మొదలవుతాయి.

కొత్త కోడలు ఆషాఢమాసంలో (మొదటి సంవత్సరం) పుట్టింటికి వస్తుంది. అత్త, (కొత్త) కోడలు గడప దాటరాదని, అత్త, అల్లుడు గడపదాటరాదని మన ఆచారం. కొత్త అల్లుడికి ఆషాఢ పట్టి అను లాంచనాన్ని తమ తమ తాహతులను బట్టి అత్తవారు ఘనంగానే జరుపుతారు.

**గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో**
**మహేశ్వర గురుసాక్షాత్**
**పరబ్రహ్మ తస్మైశ్రీ గురువేనమః**

గురుపౌర్ణమి ఈనాడు గురువులకు సత్కారం చేస్తారు విద్యార్థులు. ఏ విద్యనైనా అభ్యసించడానికి విద్యార్థి గురుముఖంగా నేర్వాలి.ద్రోణాచార్యుల వారికి బొమ్మను ప్రతిష్టించి, ఆయన ముందు నిలబడి విద్య నేర్చుకున్న ఏకలవ్యుడు గొప్పశిష్యుడు గురువు గారి అవమానానికి ప్రతీకారం చేసిన అర్జునుడు గొప్ప శిష్యుడే.ఆషాఢమాసంలో తొలి ఏకాదశి తర్వాత వచ్చే గురుపౌర్ణిమ దీనినే వ్యాసపూర్ణిమ, బుద్దపౌర్ణిమ అని కూడా పిలుస్తారు.అఖిలాండ బ్రహాండ నాయకుడైన రాజాధిరాజు పరబ్రహ్మ శ్రీసాయి నాధునికి గురుపౌర్ణమి సంధ్భంగా విశేష పూజలు నిర్వహిస్తారు.

## శ్రావణ మాసం ప్రాముఖ్యత

**లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం**
**శ్రీరంగ దామేశ్వరీం దాసీ భూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురం**
**శ్రీమన్మంద కటాక్ష లబ్ద విభవత్ బ్రహ్మేంద్ర గంగాధరమ్**
**త్వాం త్రైలోక్య కుటుంబనీం సరసిజం వందే ముకుంద ప్రియం**

1. శ్రావణ మాసం శుభప్రదమైన మాసంగా శ్రీమహాలక్ష్మిని వరలక్ష్మిగా, గౌరీ దేవిగా భావించి నోములు వ్రతాలు

ఆచరించారు. నూతన వధువు శ్రావణమాసం లోని నాలుగు మంగళవారాలు మంగళగౌరీ నోము నోస్తారు. మంగళగౌరీ నోము 5 సం॥ చేస్తారు. ప్రతి సంవత్సరము శ్రావణమాసంలో నాలుగు మంగళవారాలు నోము నోచి 5గురు ముత్తయిదువులకు 5 పూర్ణంబూరెలు, శనగలు, తాంబూలాలు, పళ్ళు రవికలముక్క పెట్టి వాయనం ఇస్తారు. మంగళగౌరీ పూజ చేసి, కథ చెప్పుకొని అక్షితలు తలమీద వేసుకోవాలి. 5 దారపు పోగులతో తోరం కట్టుకోవాలి. మధ్యలో ఒక వారం లేక సంవత్సరం ఇబ్బంది వచ్చినా తర్వాత చేసుకోవాలి. ఈ నోములో మరో ప్రత్యేకత 2 రకాలుగా చెపుకోవాలి.

1. 5 సంవత్సరాలు వాయనాలు పెరగక ప్రతి సంవత్సరం 5 గురి తోనే చేసుకుంటారు.

2. కొందరికి (కొన్ని ప్రాంతాలలో) పెరుగుతారు. ఎలా అంటే మొదట సంవత్సరం 5గురు, 2వ సంవత్సరం 10మంది, 3సంవత్సరం 15 మంది, 4వ సంవత్సరం 20 మంది, 5వ సంవత్సరం 25 మంది ముత్తయిదువులు, వాయినాలు పెరుగుతాయ్మన్న మాట.

**తోరం:** 5తెల్లని దారపు పోగులు 30 అంగుళాలు పొడవుతో తీసుకొని పసుపులో ముంచి పూలతో 5ముళ్ళు వేయాలి. తోరాన్ని కుడి చేతికి కట్టుకోవాలి. ముత్తయిదువులకు ఇవ్వాలి.

**ఉద్యాపన:** 5 సంవత్సరాలు నోచిన తర్వాత కొత్త పెళ్ళికూతురు అరుంధతీ నక్షత్రం దర్శించి వస్తుంటే ఆ గడప దాటుతున్నప్పుడు మంగళసూత్రాలు జత, మట్టెలు జత , చీర, జాకెట్, తాంబూలంతో పాటు మూసివాయనం అంటారు. (ఇత్తడి గిన్నెలో అరిశెలు ఉంచి కొత్ర వస్త్రంతో గిన్నెని మూసి ఇవ్వడం). ఐదు జ్యోతులు బియ్యంపిండితో చేసిన దీపాలు నేతితో వెలిగించి చాకుకి వెన్న రాసి ఈ దీపాలపై వచ్చేనుసిని కాటుకగా పెట్టుకుంటారు. శ్రావణమాసంలో మరో ముఖ్యమైన వ్రతం వరలక్ష్మీ వ్రతం,

**ఓం నమస్తే స్తు మహా మాయే శ్రీ పీఠే సురపూజితే।**
శంఖ చక్ర గదాహస్తే మహాలక్ష్మీ నమో స్తుతే॥
నమస్తే గరుడా రూఢే డోలాసుర భయంకరీ।
సర్వపాపహరే దేవీ మహాలక్ష్మీ నమో స్తుతే॥
సర్వజ్ఞే సర్వవరదే సర్వ దుష్ట భయంకరీ।
సర్వపాప హరే దేవీ, మహాలక్ష్మీ నమో స్తుతే॥
సిద్ధి బుద్ధి ప్రదేదేవి, భుక్తి ముక్తి ప్రదాయినీ।
మంత్రమూర్తి సదాదేవి, మహాలక్ష్మీ నమో స్తుతే॥
ఆద్యన్త రహితే దేవి, ఆదిశక్తి మహేశ్వరీ।
యోగజ్ఞే యోగ సంభూతే మహాలక్ష్మీ నమో స్తుతే॥
స్థూల సూక్ష్మే మహారౌద్రే, మహాశక్తీ మహోదరే।
సర్వపాప హరే దేవి మహాలక్ష్మీ నమో స్తుతే॥
పద్మాసన స్థితే దేవీ, పరబ్రహ్మ స్వరూపిణి।
పరమేశీ జగన్మాత ర్మహాలక్ష్మీ నమో స్తుతే॥
శ్వేతాంబరధరే దేవీ, నానాలంకార భూషితే।
జగత్ స్థితే జగన్మాతా ర్మహాలక్ష్మీ నమో స్తుతే॥
మహాలక్ష్మష్టకం స్తోత్రం, యఃపఠేద్భక్తి మాన్నరః।
సర్వసిద్ధి మవాప్నోతి రాజ్యం ప్రాప్నోతి సర్వదా॥
ఏక కాలే పఠేన్నిత్యం, మహాపాప వినాశనమ్।
ద్వికాలం యఃపఠేపిన్నిత్యం ధన ధాన్య సమన్వితస॥
త్రికాలం యఃపఠేపిన్నిత్యం మహాశత్రు వినాశనమ్॥
మహాలక్ష్మీర్భవేన్నిత్యం ప్రసన్నవరదో శుభా॥

పునిస్త్రీలు ఈ వ్రతం ఆచరిస్తారు.తరిస్తారు. శ్రీమహాలక్ష్మి దేవిని స్త్రోత్రం చేయాలి. వరలక్ష్మీ దేవీ ఆవాహన చేసి పూజచేస్తారు. శ్రావణమాసం లో పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారాన్ని వరలక్ష్మీవ్రతం చేయావడానికి శ్రేష్ఠమని పెద్దలు నిర్ణయించారు. కథలో ఈ వారం ప్రసక్తి ఉంటుంది. కానీ అన్నివారాలు శుభప్రదమైనవే ఎవరి వీలును బట్టి వారుచేసుకోవచ్చు. గతంతో కొబ్బరికాయకి పసుపురాసి, పసుపు, మైదా పిండితో ముక్కు చెవులు పెట్టి, కనులు దిద్ది, బొట్టుపెట్టి, చీర సింగారించి, ఆభరణాలుతో అలంకరించి కలశం మీద పెట్టి పూజించేవారు.తప్పనిసరిగా లక్ష్మీరూపు కొని పూజించేవారు.ఇప్పుడు అమ్మవారి ముఖం సర్వాంగ సుందరంగా వెండి, బంగారంతో తో చేసిన  బొమ్మలు విరివిగా లభ్యమవుతున్నాయి.అందువలన ఎవరికి తోచిన విధంగా వారు చేసుకుంటున్నారు.యధావిధిగా 9రకాల పిండివంటలతో నివేదన చేస్తున్నారు.ముందుగా గణపతి పూజ, వరలక్ష్మీ పూజ అష్టోత్రం చేసుకొని, కథ చెప్పుకొని అక్షింతలు వేసుకోవాలి. తోర పూజ కూడా చేసుకొని తోరం కట్టుకొని ముత్తయిదువుకి వాయనం ఇవ్వాలి. తోరం 9 పోగులు– 9ముడులు పూలతో వేసుకోవాలి.

**వాయనం :** ముత్తయిదువుకి పసుపు, కుంకుమ, అక్షింతలు, తాంబూలాలం జాకెట్‌బట్ట ఇచ్చి తోరంకట్టి, 9 పూర్ణం బూరెలు వాయనంగా ఇచ్చి భోజనం పెట్టాలి. ఈ మాసం మంగళప్రదమైనది.

## కృష్ణాష్టమి

శ్రీకృష్ణ భగవానుని జన్మదినం చాలామంది ఇంటిముందు ముగ్గుతో కృష్ణపాదాలు ఇంట్లో వచ్చేటట్లు వేసుకుంటారు.బాల కృష్ణుడు తమ ఇంటికి రావాలని కృష్ణుని పూజావిధులు నిర్వహించి, చిమ్మిరి, వెన్న , పాలు, అటుకులు, కట్టిపొంగలి నైవేద్యం పెడతారు.దేవాలయంలో ఉట్టి కొడతారు.

## అనంత పద్మనాభవ్రతం

పూర్వకాలం నుండి ఆచారంగా పెద్దలు చేసి ఉన్నవాళ్ళు. తోరాలు ఉంటాయి. భాద్రరూపం వంశపారపర్యంగా వచ్చే ఆచారం.

# రాఖీ పౌర్ణమి

### రాఖీపౌర్ణమి మరియు జంధ్యాల పండుగ (శ్రావణ పౌర్ణమి)

సోదరులకు, సోదరి రాఖీకట్టి, మిఠాయిలు తినిపిస్తారు. రక్షాబంధనం గా పిలుస్తారు.రాఖీ కట్టిన సోదరికి సోదరుడు కానుకలు ఇచ్చి ఆశీర్వదించడం సాంప్రదాయం. సోదరికి ఏ కష్టం వచ్చినా రక్షణగా ఉంటానని బాస చేస్తారు. జంధ్యాల పౌర్ణమిగా కూడా ప్రసిద్ధి చెందినది. ఈ శ్రావణ పౌర్ణమినాడు పాతజంధ్యాలను వదిలి గాయత్రీ మంత్రోచ్ఛారణతో క్రొత్తజంధ్యం ధరిస్తారు. నూతనంగా ఉపనయనం అయిన వటువుకి జంధ్యంతో జింకచర్మపు ముక్క ఉంచుతారు. పౌర్ణమినాడు అది తీసివేసి క్రొత్తది ధరింపజేస్తాడు. దీనినే ఉపాకర్మ అని అంటారు.

# భాద్రపద మాసం (శూన్యమాసం)

వివాహాది శుభకార్యాలకు ముహుర్తాలు ఉండవు. మాస ప్రారంభంలోనే చవితి, వినాయక చవితి. వినాయక చతుర్ధి అన్ని గణాలకు అధినాయకుడైన ఆ గణనాయకుడు పండుగ భాద్రపద శుద్ధ చతుర్ధి ( అమావాస్య వెళ్ళి 4రోజు) వినాయక చవితిగా భారతదేశంలో (ప్రపంచవ్యాప్తంగా) చాలా చోట్ల ఘనంగా జరుగుతుంది.గృహాలలో జరిగే చవితి పండుగ ఆ ఒక రోజుతోనే సమాప్తి అవుతుంది.మరునాడు శుక్రవారం, మంగళవారం కాకుంటే నదిలో విడిచేస్తారు.లేకపోతే మన ఇంట్లో ఉన్న

కుండీలో కూడా వేయవచ్చు. మట్టి విగ్రహాలయితే మట్టితో కలిసిపోతాయి. విఘ్నాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుని పూజించి తమ తమ కోరికలను నిర్విఘ్నంగా జరుపమని భక్తులు కోరుకుంటారు. విద్యార్ధులు పుస్తకాలను గణేశుని పాదాల చెంత ఉంచి తమని కృతార్ధులని చేయమని ప్రార్ధించుతారు. గుంజుళ్ళు తీస్తారు. గృహసముదాయాలవద్ద, నాలుగు రోడ్ల కూడలిలో పెద్ద పెద్ద గణపతి విగ్రహాలను ఉంచి పూజించీ భారీ నుంచి అతి భారీ వినాయకవిగ్రహాలకు తొమ్మిది రోజులు పూజలు నిర్వహిస్తారు. ఆమరునాడు నిమజ్జనం చేస్తారు. హైదరాబాద్, విజయవాడ లాంటి చోట్ల నిమజ్జన వేడుక కన్నుల పండుగగా జరుగుతుంది.

ఏక వింశపత్ర అని 21 నామాలతో పత్రి పూజ చేస్తారు. గణేశుని ఇష్టమైన కుడుములు, ఉండ్రాళ్ళులతో కలిపి 9 రకాల పిండి వంటలతో ఆ బొజ్జ గణపతికి నైవేద్యం పెడతారు. పాలవెల్లి తో అలంకరించి నానావిధ పత్ర పుష్పాలతో పూజ చేస్తారు.

# ఆశ్వీయుజ మాసం

దేవీ పవరాత్రులు ప్రారంభం అమావాస్య వెళ్ళిన పాడ్యమి నుండి దశమి దాకా దేవీ నవరాత్రులు. అష్టాదశ పీఠాలు, అష్టాదశ శక్తి పీఠాలు ఏవి అనే విషయానికి ప్రామాణికంగా చెప్పబడే ప్రార్ధనా శ్లోకం

*"లంకాయాం శంకరీదేవీ, కామాక్షీ కాంచి కాపురే*
*ప్రద్యుమ్నే శృంగారీదేవీ, చాముండీ క్రౌంచపట్టణే*
*అలంపురే జోగులాంచు, శ్రీశైలే భ్రమరాంబికా*
*కొల్హాపురే మహాలక్ష్మి, మాహర్యే ఏకవీరికా*
*ఉజ్జయిన్యా మహాకాళీ, పీఠిక్యాం పురు హూతికా*
*ఓఢ్యాయం గిరిజాదేవీ, మాణిక్యా దక్షవాటికే*
*హరిక్షేత్రే కామరూపా ప్రయాణే మాధవేశ్వరీ*
*జ్వాలాయాం వైష్ణవీదేవీ, గయా మాంగల్య గౌరికా*
*వా రాణాస్యాం విశాలాక్షి, కాష్మీరేషు సరస్వతీ*
*అష్టాదశ సుపీఠాని యోగి నామపి దుర్లభమ్*
*సాయంకాలే పఠేన్నితం, సర్వశతృవినాశనమ్*
*సర్వరోగహం దివ్య సర్వ సంపత్కరం శుభమ్ "*

వీటితో పాటుగా విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మవారు వరంగల్లు భద్రకాళీ అయ్యావారితో పాటుగా వెలసిన ఇతర క్షేత్రాలలో, విడిగా ఏ దేవాలయాలలో అమ్మవారు ఏ రూపంలో నున్నను అచట నవరాత్రులు నిర్వహిస్తారు.

1. **స్వర్ణ కవచాలాంకృత దుర్గాదేవి**
2. **బాలాత్రిపుర సుందరీ దేవి.**
3. **కనకదుర్గ.**
4. **గాయత్రీ దేవి.**
5. **గౌరీ దేవి.**
6. **సరస్వతీ దేవి.**

### 7.మహాలక్ష్మీ దేవి, అన్నపూర్ణా దేవీ, మహిషాసురమర్ధినీ, రాజరాజేశ్వరి

ఇలా రోజు కొత్త అలంకారంతో అలంకరించి అత్యంత రమణీయంగా, వైభవంగా నవరాత్రులు నిర్వహించి పండుగగా అభివర్ణిస్తారు. మూలా నక్షత్రం అమ్మవారి జన్మ నక్షత్రం ఆ రోజు అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి విశేషపూజలు చేస్తారు. మల్లెలు, చామంతులు, గులాబీలు, తామరపూలు, పారిజాతపూలతో అలంకరిస్తారు. (శాకాంబరిగా అమ్మవారిని కాయగూరలతో అలంకరిస్తారు.) నవరాత్రులలో తల్లి దర్శనం అత్యంత శుభప్రదం.

**రోజూవారి నైవేద్యాలు:** పొంగలి, పులిహోర, కట్టెపొంగలి, చక్ర పొంగలి, గారెలు, కేసరి ఇవి మన గృహాలలో, దేవాలయాలలో రోజూ అన్ని చేసి నైవేద్యం సమర్పిస్తారు. ఆ తల్లి పాయాసాన్న ప్రియగా ధధ్యన్నాసక్తగా శ్రీ లలితా సహస్రనామాలలో చెప్పబడింది.

విజయవాడలో వేంచేసియున్న దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగు నవరాత్రి మహోత్సవంకి తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి వారినుండి అమ్మవారికి పట్టు వస్త్రాలు కానుకగా వస్తాయి. కలియుగదైవంకి కనకదుర్గమ్మ సోదరిగా ఈ గౌరవం కలుగుతుంది. దేవాలయాలలో చండీయాగం, ఆఖరిరోజు జమ్మిచెట్టు పూజ నేత్రపర్వంగా నిర్వహిస్తారు.

ఆసమయంలో శ్రీ వేంకటేశ్వరస్వామికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. చక్రస్నానాలు, నిత్యకళ్యాణాలతో ఇతర సేవలతో స్వామివారిని సేవిస్తారు. రోజుకొక వాహనంపై మాఢవీధులలో ఊరేగిస్తారు. దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం నుండి కూడా శ్రీవారికి బ్రహ్మోత్సవాల సందర్భంగా కానుకలు సమర్పిస్తారు. ఆడపిల్లల చేత వేడుకగా బొమ్మలు పెట్టించి పేరంటం చేస్తారు.

## దీపావళి

ఆశ్వీజమాసం చివరకి వచ్చే అమావాస్య దీపావళి అమావాస్య నరకచతుర్ధ నరకసంహారమైన తర్వాత దీపాలు వెలిగించి ఆ కాంతిలో దీపావళి టపాసులు కాల్చి లక్ష్మీపూజ చేసుకుంటారు. పిల్లలు చాలా సరదాపడే పండుగ దీపావళి. సాయంత్రం దీపాలు పెట్టి లక్ష్మీపూజ చేసి స్వీట్స్ నివేదన చేసి టపాసులు కాల్చుకుంటారు.

## కార్తీకమాసం

శివకేశవు లిరువురూ పూజలందుకునే ప్రత్యేకమైన ప్రశస్తమైన మాసం ఆశ్వీయుజమాసం ఆఖరిలో వచ్చే అమావాస్య దీపావళి. అమావాస్య ముందురోజు నరకచతుర్ధశి నరకాసురవధ తర్వాత వచ్చే అమావాస్య నాడు దీపాలు వెలిగించి రాక్షస బాధ తప్పించిన ఆదేవదేవుని పూజించి దీపాల కాంతితో అమావాస్య చీకటులను తొలగించి ఆ కాంతితో బాణాసంచా కాల్చడం మన ప్రధాన ఆచారం. ఆ మరుసటి రోజునుండే కార్తీకమాసం మొదలు. కొందరు రోజూ తెల్లవారుఝామున 4 గంటలకు బ్రహ్మఘడియలు ఆ సమయంలో స్నానమాచరించి దీపారాధన చేస్తారు. శివునికి ఉపవాసాలు, జాగారాలు, బిల్వ పత్రాలు, అభిషేకాలు ప్రీతి. నారాయణ మూర్తి పట్టు పీతాంబరాలు, బాలభోగాలు నిత్య నైవేద్యాలతో ప్రీతి చెందుతాడు.

కార్తీక మాసంలో వచ్చే సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి సాధారణంగా అందరూ ఉపవాసం ఉండి శివాలయాలలో అభిషేకం, దీపారాధన చేస్తారు. సాయంత్రం ఆ పరమేశ్వరనికి నైవేద్యం పెట్టి భోజనం చేస్తారు. కొందరు “నత్తాలు ” అనిఈ మాసం మొత్తం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం చేసి రాత్రికి భోజనం/ఫలహారం చేస్తారు. విష్ణుమూర్తి కార్తీక దామోదరునిగా తులసీధాత్రీసహితలక్ష్మీ నారాయణునిగా కీర్తించబడతారు. చిలుకు ద్వాదశి నాడు 12 ఒత్తులతో దీపాలు వెలిగించాలి.

### నాగుల చవితి

ఈ రోజు పుట్టలో పాలు పోస్తారు. ఒక పూట భోజనం చేస్తారు. చిమ్మిరి నైవేద్యం పెడతారు. పుట్టలో పాలు పోసిన వారు కాయకూరలు కత్తితో తరగరు. చిక్కుడు కాయలు, బంగాళదుంప లాంటి కత్తిపీట ఉపయోగించకుండా చేయగల కూరలతో భోజనం చేస్తారు.

## భగినీ హస్త భోజనం

సోదరుడు తన సోదరి గృహానికేతెంచి, సోదరి చేతి భోజనం చేసి ఆశ్వీరిందిచడం ఒక సంప్రదాయం. అలాగే సోదరికి తన ఇంటికి ఆహ్వానించి పసుపు కుంకుమలతో సత్కరించడం రివాజు. యమధర్మరాజు తన సోదరి యమున చేతి భోజనం చేసి వరమీయ సంకల్పించగా, యమున కోరిన, కోరిక ఈ భగినీ హస్త భోజనం. చాతుర్మాస వ్రతదీక్ష కూడా పూర్తి అయ్యేది ఈ మాసంలోనే.

## చిలుక ద్వాదశి- క్షీరాబ్ది ద్వాదశి

కార్తీక మాసంలో శుక్లపక్షంలో వచ్చేటటువంటి ద్వాదశిని చిలుకుద్వాదశి, మధిర ద్వాదశి అంటారు. చిలుకు అన్నా మధిర అన్నా పాలసముద్రంలో చేశారు కాబట్టి ఈ పేరు వచ్చింది. ఉపవాసాలు పాటించే వాళ్ళు ఏకాదశి నాడు ఉపవాసం వుండి మరునాడు ద్వాదశి ఘడియలో దీక్ష విరమిస్తారు. ఏకాదశి అనగా 5 జ్ఞానేంద్రియాలు, కర్ణేంద్రియాలు మనసు కలిసి ఏకీకృతంగా ఉండటానికి దోహదపడుతుంది. మన మనసులో ఆధిపత్యం చంద్రునిదే కనుక చంద్రునిలో 11 కళలు ఉన్నాయి కనుక ఒకటి శుక్లపక్షానికి, ఒకటి కృష్ణపక్షానికి అందుకని చంద్రుని సాధన చేయటానికి మన మనసు సంసిద్ధం అవుతుంది. ఏకాదశి నాడు ఉపవాపం ఉండి, ద్వాదశి నాడు పారణ చేస్తారు. పారణ అయిన తర్వాత సాయం సమయములో ఎన్నో దీపాలు తులసి దగ్గర పెట్టి క్షీరాబ్ధి ద్వాదశి చేస్తారు. దీనిని దీపదానోత్సవం అని అంటారు. దీపాన్ని దానం చేసే విధానం కూడా ఇందులో ఇమిడి ఉంది. వెండి ప్రమిదలో బంగారు వత్తి వేసి వెలిగించి దీపాన్ని మగవాళ్ళయితే విష్ణు స్వరూపంగా భావించి దానం చేసి నమస్కరిస్తారు. ఆడవాళ్ళకయితే మహాలక్ష్మిగా, పార్వతిగా భావించి నమస్కరిస్తారు. ఇంట్లో తులసి వద్ద కూడా ఎన్ని ఎక్కువ దీపాలు వెలిగిస్తే అంత గొప్ప ఫలితం వస్తుందని భావిస్తారు. యోగ నిద్రాముద్రితుడైన నారాయణుడు, ఆయన ఎప్పుడు యోగముద్రలోకి వెళ్ళాడంటే ఆషాఢశుద్ధ ఏకాదశి నాడు యోగ నిద్రలోకి వెళ్ళారు. దీనినే శయన ఏకాదశి అంటారు. కార్తీక ఏకాదశి నాడు ఆయన నిద్ర చాలించి లేస్తాడు. తలుపులు తీసేటప్పటికి పాల సముద్రములో దీపాలు కనపడితే సంతోషిస్తాడు. ఆయనకు ఎవరైతే దీపాలు వెలిగించి వైకుంఠానికి దారి చూపుతారో, వారిని అనుగ్రహిస్తాడని విశ్వాసం. ఈ మాసం దీపాలకి, ఉపవాసాలకి శివకేశవుల అనుగ్రహానికి అత్యంత శుభఫలితాలకి నిలయం. భక్తులు అత్యంత శ్రద్ధతో ఆచరించి తరించగల మాసం. దానాలకి కూడా ఈ మాసం ప్రసిద్ధి.

# మార్గశిర మాసం

మాసములలో శిరస్సు వంటిది మార్గశిర మాసమని ఒక నానుడి. సుబ్రహ్మణ్య షష్ఠి, ముక్కోటి ఏకాదశి ముఖ్యమైనవి, ప్రశస్తమైనవి. సుబ్బారాయుడి షష్ఠి అని కూడా వ్యవహరిస్తారు.

## సుబ్రహ్మణ్య ప్రశస్తం

మార్గశిర శుద్ధ షష్ఠి ఆ స్కందుని ఆరాధన చేయుటకు అనువైన శుభతిథి. సుబ్రహ్మణ్య షష్ఠి, ఆరాధన అగ్ని ఉపాసన తోనే జరుగుతుందని శాస్త్రం తెలియజేయుచున్నది. షణుకాలతో సుబ్రహ్మణ్యారాధన విధి సౌర, శాక్త, వైష్ణవ, గణాపత్యశైవములు అందుచే అగ్ని గర్భుడు అని పేరు. పంచాయతన పూజలో ప్రత్యక్షంగా స్వామి మూర్తి ఉండదు. అయితే దీపారాధన శివశాక్త్యాత్మకుడైన అగ్ని సంభవుడైన సుబ్రహ్మణుని ఆరాధించడం శుభమని వైదిక ధర్మంతో సుబ్రహ్మణ్యోపాసన చెప్పబడింది. 'అహం' తత్వానికి ప్రతీక సుబ్రహ్మణ్యుడు రహస్యంగా అందరిలోనూ ప్రకాశించే పరమాత్మ చైతన్యమిది కనుక ' గుహ' అన్నారు. స్వామిని, శివతేజస్సు నుండి ఉద్భవించిన వాడు కనుక జ్ఞానతత్వం కలిగి 'గురుగుహ' అని స్వామికి నామం. అసలు స్వామి అనే మాట అమరకోశం ప్రకారం ఒక్క సుబ్రహ్మణ్యుడిదే. ఎందుచేతనంటే " దేవసేనాపతీ, శూర, స్వామి గజముఖానుజ అని అర్థంగా ఇవ్వబడింది.

పురుషో విష్ణు కిత్యుకః శివోనా నా మతః స్మృతిః

అవ్యక్తం తు ఉమాదేవీ శ్రర్వా పద్మ నిభేక్షణా

తత్ సంయోగా దహంకారః సచ సేవాపతిరుహః

పరమపురుషుడు శివుడు లేక విష్ణువు అవ్యక్త శక్తి ఉమాదేవి లేక లక్ష్మీదేవి. వీరిరువురి సమైక్య సయన్వయ తత్వమూర్తి కుమారస్వామి అని స్కాందపురాణం చెబుతోంది. అంటే కుమార స్వామిని పూజిస్తే శివశక్తుల్నీ, లక్ష్మీనారాయణులనీ కలిపి అర్చించినట్లే ప్రబ్రహ్మతపో నిర్మితమైన శరవణం (రెల్లుతుప్ప) లోంచి ఉద్భవించిన వాడు కనుక శరవణభవుడు అయ్యాడు.

## సుబ్రహ్మణ్య ధ్యానం

శక్తిహస్తం విరూపాక్షం షడాననం దారుణం, రిపోఘ్నుం భావయే కుక్కుట ధ్వజమ్

షడాననం కుంకుమ రక్త వర్ణం మహామతిం దివ్య మయూర వాహనమ్

రుద్రస్యసూమం సురసైన్యనాథం గుహ సదా హం శరణం ప్రపద్యే

కుమారేశసూనో గుహస్కంద సేనాపతే, శక్తిపాణే మయూరాధి రూఢ

## ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి విశిష్టత)

శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం

విశ్వాకారం గగనసదృశ్యం మేఘ వర్ణం శుభాంగం, లక్ష్మీకాంతం కమల నయనం

యోగి హృద్యాన గమ్యం వందే విష్ణుం భవభయహరం సర్వలోకైక నాథం

సూర్యుడు ఉత్తరాయణానికి మారేముందు వచ్చే శుద్ధ ఏకాదశి వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. ఈ రోజున వైకుంఠ వాకిళ్ళు తెరుచుకొని ఉంటాయని వైష్ణవాలయలలో గల ఉత్తరద్వారం వద్ద భక్తులు తెల్లవారుఝామునే వేచి ఉంటారు. ముక్కోటి రోజున మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి, భక్తులకు దర్శనమిస్తాడు. కనుక దీనిని ముక్కోటి ఏకాదశి అని పేరు వచ్చిందన్నమాట. ఈ ఒక్క ఏకాదశి మూడుకోట్ల ఏకాదశులతో సమానమట. ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం అమృతం రెండూపుట్టాయి. ఈ రోజునే శివుడు హాలాహలం గరళంలో నిలిపి గరళకంఠుడయ్యాడు. సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించిన అనంతరం మకరసంక్రమణం వరకు జరిగే " మార్గళి" మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుందని చెబుతారు. ముక్కోటి రోజున భక్తులు ఉత్తర ద్వారం గుండా వెళ్ళి మహావిష్ణువును దర్శనం చేసుకుంటారు. ఏకాదశి నాడు ఉపవాసం ఉండి ద్వాదశి నాడు అన్నదానం చేస్తే మంచిది. పూజ, జపం, ధ్యానం లేదా ఉపాసన మొదలైన సాధనముల ద్వారా మనసును మాధవుడిపైన లగ్నం చేయాలి.

పంచజ్ఞానేంద్రియాలు, పంచకర్మేంద్రియాలతో కలుపుకొని పది. వాటితోపాటు మనస్సు అనే పదవకొండ ఇంద్రియాన్ని కలుపుకొని మానవులు పదకొండు ఇంద్రియాల ద్వారా పాపాలు చేస్తారు. ఆ పదకొండే అజ్ఞానానికి స్థానం. అందుకే పదకొండు స్థానాల్లో ఉన్న మురాసురుణ్ణి, జ్ఞానప్రదాయిని మాత్రమే సంహరించగలదు. అందుకే ఏకాదశీ వ్రతాన్ని నిష్ఠగా ఆచరించినవారు, జ్ఞానవంతులవుతారని చెబుతారు.

కృతయుగంలో మురాసురడనే రాక్షసుడు దేవతలను, సత్పురుషులను బాధించేవాడు దేవతలు తమ బాధ విష్ణుమూర్తికి విన్నవించారు. రక్షించమని వెళ్ళి ప్రార్థించారు. విష్ణువు దండెత్తి రాక్షససైన్యాన్ని సంహరించారు, కానీ మురాసురుడు తప్పించుకొని వెళ్ళి సాగర గర్భంలో దాక్కున్నాడు. బయటికి రప్పించే ఉపాయాన్ని ఆలోచించిన విష్ణువు ఒక గుహలోకి వెళ్ళాడు. విష్ణువు నిద్రిస్తున్నాడని భ్రమించిన మురాసురుడు, విష్ణువును వధించడానికి కత్తినిఎత్తాడు అంతే మహాలక్ష్మి దుర్గ రూపంలో ప్రత్యక్ష్యమై మురాసురుడిని సంహరించింది. విష్ణువు లేచి ఆమెను మెచ్చుకుని 'ఏకాదశి' అనే బిరుదు నిచ్చారు.

అప్పటినుండీ ఏకాదశీ వ్రతం ప్రాచుర్యం పొందింది. ఇందులోని తాత్విక సందేశం ఇలా ఉంది. విష్ణువు ఉండే గుహ ఎక్కడోలేదు, దేహమే దేవుని దేవాలయమని శాస్త్ర నిర్ణయం. ఉపనిషత్తులు తెలిపినట్లుగా ప్రతి మానవ హృదయంలోను పరమాత్మ

ప్రకాశిస్తున్నాడు. అంత దగ్గరలో ఉన్న పరమాత్మను ఉద్దేశించి ఏకాదశీ వ్రతాన్ని ఆచరించాలి. ఇదీ హిందువులు పరమ పవిత్రముగా భావించే ముక్కోటి సారాంశం.

# పుష్యమాసం

భోగి, సంక్రాంతి, కనుము, ఉత్తరాయణం ప్రారంభం, సావిత్రీ గౌరీవ్రతం భీష్మ ఏకాదశి. ఈ పండుగలన్నీ పుష్యమాసంలో వచ్చేవే. ఇవన్నీ మానవాళికి శుభాలు చేకూర్చేవే.

## భోగి

ఈ నెలంతా ఇంటిముందు ముగ్గులతో కళకళలాడుతుంది. రకరకాల ముగ్గులు గోమయంతో కళ్ళాపి జల్లి రంగ వల్లులు తీర్చిదిద్ది, గొబ్బెలతో అలంకరిస్తారు. ముగ్గుమధ్యలో పెద్ద గొబ్బెమ్మ, చుట్టూ చిన్నవీ పెడతారు. గొబ్బెమ్మలపై బియ్యంపిండితో గీతలు గీసి పసుపు, కుంకుమలతో అలంకరించి, ఆపైన పూలు పెడతారు. గొబ్బెమ్మలను గోపెమ్మలుగా భావించి మధ్యలో నున్న పెద్ద గొబ్బెమ్మని కృష్ణునిగా భావించి పూజించడం కూడా ఆచారం. మధ్యాహ్నం దాటాక గొబ్బెమ్మలను తీసి పిడకలుగా గోడలపై కొడతారు. వీటిని భోగిమంటలలో కొన్ని, తర్వాత వచ్చే రథసప్తమి నాడు పాలు పొంగించడానికి ఉపయోగిస్తారు. భోగినాడు వేకువనే లేచి ఇంట్లో ఉన్న చెత్త (కర్రముక్కలు, విరిగిన చాటలు వగైరా) పెద్ద పెద్ద కలప దుంగలు వేసి భోగి మంటలు వేస్తారు. బొమ్మల కొలువులు పెడతారు. సాయంత్రం పిల్లలకు భోగి పళ్ళు పోస్తారు. దీనిలో రేగు పళ్ళు ,చెరుకు ముక్కలు, చిల్లర కలిపి పోస్తారు.

## సంక్రాంతి

సంక్రాంతి అంటేనే పెద్ద పండుగ. పంటలు పండి ధాన్యం ఇంటికొస్తుంది. సంక్రాంతి నాడు క్రొత్త ధాన్యంతో పొంగలి చేస్తారు. సంక్రాంతి అంటే “సంక్రమణము” అంటే “మారడం” అని అర్ధం వస్తుంది. పశువులకి కూడా పండుగే. దుక్కి దున్ని మనకి కావాల్సిన ఆహారాన్ని పండించడానికి ఎంతో సహాయం చేసిన గిత్తలకు (ఎద్దులకి) అలంకరించి గౌరవిస్తారు. పాడిచ్చే ఆవులకి, గేదెలకి కూడా నమస్కరిస్తారు. వేకువనే హరికీర్తనలతో వచ్చి మేలుకొలిపే హరిదాసులకి దోసిళ్ళతో ధాన్యం సమర్పిస్తారు. ధాన్యం స్వీకరించిన హరిదాసు కృష్ణార్పణం అనటం వల్ల భగవంతునికే సమర్పించిన అనుభూతి కలుగుతుంది. పుట్టింటి కొచ్చే ఆడపడుచులతో, వేడుకగా సంబరంగా జరుగుతుంది సంక్రాంతి. సంక్రాంతికి ఆంధ్రాలో అరిశెలు తప్పనిసరిగా చేస్తారు.

## సంక్రాంతి పురుషుడు

భోగినాడు “సంకురమయ” అనే మట్టి బొమ్మను, బొమ్మల కొలువులో పెట్టి నివేదన చేస్తారు. ఒక్కో సంవత్సరం ఒక్కొక్క వాహనంపై సంకురమయ ఎక్కి వస్తాడు. ఆయన ఎక్కిన వాహనం వలన ఆ సంవత్సర రాశిఫలాలు నిర్ణయించబడతాయి. ఆ సంవత్సర మంచి,చెడులు ఏ ప్రభుత్వం పరిపాలించగలదో, ఆ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉంటుందో లేదో తెలిసిపోతుంది.

## కనుమ

పశువుల పండుగగా వ్యవహరిస్తారు. సంవత్సరమంతా పడిన శ్రమకు ఫలితమైన ధాన్యరాశులు నట్టింట నిలిచే రోజు పాడిని ప్రసాదించిన గోమాతను, పంటకు సాయంగా నిలిచిన బసవన్నను పూజిస్తారు. తెల్లవారగానే పశువులకు శుభ్రంగా కడిగి కొమ్ములకి, ముఖ్యానికి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టి పూలమాలలు వేస్తారు. కొమ్ములకి వెండి కొప్పులు ధరింపజేసి ఆకులో అన్నం పెట్టి తినిపిస్తారు. సంక్రాంతితో ఉత్తరాయణ పుణ్యకాలం మొదలవుతుంది. ఇది దేవతలకు పగలు అని నమ్మకం.

## ముక్కనుము

ముక్కనుమ రోజు సావిత్రి నోములు ప్రారంభిస్తారు. ముత్తయిదువుతో కుమ్మరి ఇంటినుంచి మట్టిబొమ్మ (సావిత్రి అమ్మవారిలాగా భావించి) మేళ తాళాలతో తీసుకువచ్చి ఒకరి ఇంట్లో బంతిపూలతో అలంకరించిన ఉయ్యాలలో ఆవాహన చేసి ముత్తయిదువులందరూ అక్కడే సాయంత్రం పూజ చేస్తారు. ఇది 9రోజులు, 9ఏళ్ళకాలం, ప్రతి సంవత్సరం, 9రోజులు చేయాలి.నైవేద్యాలు1రోజు.పులగం, 2వ రోజు ధధ్యోజనం, 3వ రోజు చలివిడ్డి, 4వ రోజు నానుబాలు (పాలలో బియ్యం వేసి ఉడికి ఉడకని), 5వ రోజు అప్పాలు, 6వ రోజు ఉండ్రాళ్ళు, 7వ రోజు అట్లు- 9 పోగుల తోరణం కట్టి, ముత్తయిదువులకి భోజనం, 9 అట్లు వాయనం ఇవ్వాలి. ఆ రోజు తోరం కట్టుకోలేని ఇబ్బంది ఎదురైతే ఆ సంవత్సరం నోము ఆగినట్లే. తోరం కట్టిన తర్వాత ఇబ్బంది వస్తే ఆ సంవత్సరం నోము చేసినట్లే, 8వ రోజు పరమాన్నం, 9వరోజు 9 రకాల కూరలతో పులుసు.

## వేడుకలు

1.గాలిపటాలు ఎగురవేయుట, 2. కోడిపందాలు, 3. ఎడ్లపందాలు మొదలయినవి సరదాలు. బొమ్మలు పెట్టేవాళ్ళు 3రోజులు లేదా 9రోజులు వేడుక చేస్తారు. బొమ్మలకి దీపారాధన, నైవేద్యం, సాయంత్రం పేరటం చేస్తారు.పండు తాంబూలం, శనగలతో ముత్తయిదువులకి వాయనం ఇస్తారు. పితృదేవతలకు తర్పణం, దానాలు చేస్తారు.

## భీష్మ ఏకాదశి

ఈరోజే విష్ణు సహస్రనామం పుట్టినది. భీష్మపితామహుడికి స్వచ్ఛంద మరణం (కోరుకున్నపుడు)ఉన్నందు వలన అంపశయ్యపై ఉండి కూడా, ఉత్తరాయణ పుణ్యకాలం కొరకు వేచి ఉండి, ఏకాదశి రోజున శ్రీకృష్ణ పరమాత్మ దివ్యఆశీస్సులతో అత్యంత గోప్యమైన ధర్మాన్ని ధర్మరాజుకు ఉపదేశిస్తాడు.అదియే శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం. రాజనీతి, కార్యదకక్ష, వివేకం, పరిశుద్ధమైన భావం కలిగిన వారు భీష్మాచార్యులు. చేసిన ప్రతిజ్ఞలకు జీవితాంతము కట్టుబడినాడు. ధర్మానికి మారు పేరు. మహాభారతంలో ఏమి చెప్పారంటే దేవతలైనా సరే ధర్మసంకటము వచ్చినప్పుడు భీష్మని వద్దకు వచ్చేవారట. అంతట ధర్మ స్వరూపు లైనందు వలన ద్వాపర యుగంలో శ్రీవిష్ణు సహస్ర నామాన్ని లోకానికి అందించుటకు శ్రీకృష్ణపరమాత్మ భీష్మని ఎంచుకున్నారు.ఈ నాటికి విష్ణు సహస్రనామ పుట్టినరోజును " భీష్మఏకాదశిగా" గా పిలువబడుతున్నది. అది భీష్మాచార్యుల పూర్వజన్మ పుణ్యఫలం. అధర్మం వైపు నిలబడి ధర్మయుద్ధం చేయవలసి వచ్చింది.ఎంతో మానసిక వ్యధను అనుభవించారు.కానీ ధర్మాన్ని విడువలేదు.అందుచే శ్రీకృష్ణ సాన్నిధ్యం పొందగలిగిన ధన్యజీవి " ఒక చేతితో ధర్మాన్ని ఆచరించండి, మరుక్షణమే మరో చేతితో ఫలితాన్ని అందుకోండి. అధర్మం అయినా అంతే. ఇప్పటికీ/ ఎప్పటికి ఏకాదశి భీష్మ ఏకాదశి గానే కీర్తించబడుతుంది. ఆయనకు సంతానం లేకపోయినా మరణించాక ఈ నాటికి పితృతర్పణాలు అందుతున్నాయి. మహోన్నతమైన వ్యక్తిగా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడినది.

# మాఘమాసం (మహాశివరాత్రి, రథసప్తమి)

ప్రతినెలా సాధారణంగా కృష్ణచతుర్ధశి నాడు శివరాత్రి వస్తుంది.దానిని మాసశివరాత్రి అంటారు.మాఘమాసంలో వచ్చే శివరాత్రి మహాశివరాత్రి. శివరాత్రి నాడు తెల్లవారుజామునే లేచి వీలుంటే నదీ స్నానం చేసి లింగార్చన, అభిషేకం చేసి ఆరోజంతా ఉపవాసం ఉండి రాత్రికి జాగారం చేస్తే మహాపుణ్యం. శివరాత్రి నాడు రాత్రి 12గం॥కి లింగోద్భవమైనందువలన, ఆ రోజే శివపార్వతుల కళ్యాణం కూడా జరుగుతుంది. మారేడు దళములతో, బిల్వ పత్రాలతో పూజించిన చాలా పుణ్యం. ఆ రోజు ఏ చిన్న స్తుతి చేసినా ఆ భోళాశంకరుడు పరవశించి అనుగ్రహిస్తాడు. రుద్రాభిషేకం, అర్చన ఏంచేసినా సరే, ఉపవాసం ఉన్నా, జాగారం చేసినా, దీపారాధన చేసిన అన్ని చేసినా మరుజన్మలేదని అంటారు. లింగాకారంలో ఆవిర్భవించినందున లింగార్చన, లింగాష్టం ప్రధానంగా చేస్తారు.

## రథసప్తమి

మాఘశుద్ధ సప్తమి సూర్యభగవానుడు పుట్టిన తిథి. లోక సాక్షి అయిన ఆ సూర్యభగవానుని అర్చించి, ఆయనకరుణా కటాక్షం పొందే సుదినమే రథసప్తమి.మాఘశుద్ధ సప్తమి, అదే ఆయన జన్మతిథి. సూర్యుడు జన్మించిన ఈ మాఘమాసంలో రథసప్తమి నాడు ఆయనను పూజించే అవకాశం లేనివారు ఆమాసంలో ఏదో ఒక ఆదివారం నాడు పూజించినా సత్ఫలితం ఉంటుందని పెద్దలంటారు.

రథసప్తమి నాడు సూర్యోదయానికి పూర్వమే స్నానాధికాలు చేసి, సూర్యోదయానంతరం దానాలు చేయాలి. ఆరోజు సూర్యభగవానుని ఎదుట ముగ్గువేసి, ఆవు పిడకలపై ఆవుపాలు పొంగించి ,పొంగలి చేసి,చిక్కుడు ఆకులలో ఆపొంగలిని ఉంచి, ఆయనకు నివేదన ఇవ్వాలి. ఇతర మాసములలోని తిధులకన్న మాఘమాస సప్తమి బాగా విశిష్టమైనది.సూర్యుని గమనం ఏడు గుఱ్ఱములు పూన్చిన బంగారు రథం మీద సాగుతుందని వేదము " హిరణ్యయేన సవితారథేన" అని తెలుపుతుంది.

సూర్యగమనం ప్రకారం ఉత్తరాయణం, దక్షిణాయనం అని రెండు విధములు. ఆషాఢ మాసం నుండి పుష్యమాసం వరకు దక్షిణాయనము. సూర్యరథం దక్షిణాయనములో దక్షిణ దిశగా పయనిస్తుంది. తరువాత సూర్యుడు మకరరాశి ప్రవేశం ఉత్తరాయణ ప్రారంభ సూచకము రథసప్తమి అని పేరు వచ్చింది. ఆ రోజు పవిత్ర దినముగా భావించి భారతీయులు సూర్యుని ఆరాధిస్తారు.' భా' అంటే సూర్యకాంతి, 'రతి' అంటే సూర్యుడు. కావున సూర్యుని ఆరాధించే వారందరూ భారతీయులే. 'భారతీ' అంటే వేదమాత. వేదమాతను ఆరాధించు వారందరునూ భారతీయులే.

# చైత్రమాసం

చైత్రశుద్ధ పాడ్యమి తెలుగు సంవత్సరాది. ఉగాది నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. ఇది తెలుగు వారి మొదటి పండుగ కొత్త సంవత్సరంలో రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొని గ్రహశాంతులు జరిపించుకుని సుఖంగా ఉండటానికి పంచాంగ శ్రవణాన్ని చేస్తారు. చైత్రశుద్ధ పాడ్యమి రోజున బ్రహ్మ సృష్టిని నిర్మించడం ప్రారంభమైనదని నమ్ముతారు.మత్స్యావాతారము ధరించి విష్ణువు సోమకుని సంహరించి వేదాలను బ్రహ్మ కప్పగించిన సందర్భంగా "ఉగాది" ఆచరణలోకి వచ్చెనని పురాణప్రతీతి బ్రహ్మదేవుడు ఈ జగత్తును చైత్రమాస శుక్లపక్ష ప్రధమ దినాన సూర్యోదయ వేళ సమగ్రంగా సృష్టించాడంటారు.అంటే కాలగణాన్ని, గ్రహ, నక్షత్ర, రుతు, మాస, వర్ష, వర్షాధికులను విధాత ఈనాడు ప్రవర్తింప చేస్తాడన్నది పెద్దల భావన. అంతేకాదు వసంత ఋతువు కూడా అప్పుడే ప్రారంభమవుతుంది. అందుకే కొత్త జీవితానికి నాందిగా ఉగాది జరుపుకుంటారు.'యుగాది' ఉగాది అనే రెండు పదాలు వాడుకలో ఉన్నాయి.'ఉగ' అనగా నక్షత్ర గమనం. నక్షత్ర గమనానికి ఆది అంటే ఉగాది.యుగము అంటే ద్వయము లేక జంట అని కూడా అర్ధము. ఉత్తరాయణం, దక్షిణాయనములనబడే ఆయన ద్వయసంయుతం యుగం (సంవత్సరం) కాగా ఆ యుగానికి ఆది సంవత్సరాది.యుగాది శబ్దానికి ప్రతిరూపమైన ఉగాదిగా వ్యవహృతమైనది.

ఒక్క తెలుగు సంప్రదాయంలోనే కాకా మరాఠీలు "గుడి పడ్వాగానూ", తమిళులు "పుత్తాండు" అని, మలయాళీలు " విషు" అని, సిక్కులు వైశాఖీగానూ, బెంగాలీలు "పొయ్‌లా, భైశాఖ్ గాను జరుపుకుంటారు.

## ఉగాది పచ్చడి ప్రాముఖ్యం

ఉగాది భావాన్ని తెలిపేది ఉగాది పచ్చడి. షడ్రుచుల సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలకు ప్రతీక. జీవితం అన్ని అనుభవములు కలిగిన దైతేనే అర్ధవంతం అని చెప్పే భావం ఇమిడి ఉంది. ఒక్క పదార్ధం ఒక్కొక్క భావానికి ప్రతీక **బెల్లం- ఆనందానికి**

**ఉప్పు- జీవితంలో ఉత్సాహం, రుచికి**

**వేపపువ్వు- చేదు బాధకలిగించే అనుభవాలు**

**పులుపు- నేర్పుగా వ్యవహరించవలసిన పరిస్థితులు**

**పచ్చిమామిడి ముక్కలు- వగరు- కొత్త సవాళ్ళు**

**కారం- సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులు**

పంచాంగం శ్రవణం కవితాగోష్టులు, కవిసమ్మేళనాలు, అష్టావదానాలు శతావధానాలు అన్ని ఉగాది రోజే మొదలవుతాయి.

## శ్రీరామ నవమి

**శ్లో॥ శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే సహస్రనామ**

**తతుల్యం రామనామ వరాననే.**

శ్రీరాముని పుట్టిన రోజు, మరియు సీతారాముల కళ్యాణం జరిగినరోజు. శ్రీరాముడు వసంత ఋతువులో చైత్ర శుద్ధ నవమి, పునర్వసు నక్షత్రము కర్కాటక లగ్నంలో అభిజిత్ ముహూర్తంలో అంటే మధ్యాహ్నం 12 గంటల వేళ త్రేతాయుగంలో జన్మించారు. తెలంగాణాలో గల భద్రాచల మందు సీతారామ కళ్యాణ ఉత్సవాన్ని వైభవోపేతంగా జరుపుతారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం రాములవారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు పీతాంబరాలు సమర్పిస్తారు.

అతి చిన్న పల్లె యందుకూడా రామాలయం ఉండటం విశేషం. శ్రీరామనవమి హిందువులకు అత్యంత ముఖ్యమైన పండుగ. అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

సీతారామ కళ్యాణం లోక జీవన హేతుకం. సకల దోషనివారణం, సర్వసంపదలకు నిలయం. సకల జనలోక సంరక్షణమే శ్రీరామనవమి పండుగ పరమార్థం. శ్రీరామచంద్రుని క్షేత్రాలలో అత్యంత వైశిష్ట్య ప్రాధాన్యత, ప్రాశస్త్యము గల క్షేత్రం భద్రాచలం దివ్యక్షేత్రం. భద్రుడు అనగా రాముడు అని అచలుడు అంటే కొండ అని అందుకే రాముడు కొండపై నెలవై ఉన్న దివ్యధామము కనుక ఈ క్షేత్రం భద్రాచలంగా ప్రసిద్ధిచెందినది. శ్రీరాముని భక్తుడైన భద్రుడేఈ కొండ అనికూడ అంటారు, అందుకే భద్రాచలమైంది.

ఆంధ్రా, తెలంగాణాలలో తెలుగు వారు ఇంటిముందు పందిరివేసి కళ్యాణం చేస్తారు. భద్రాచలం తాసీల్దార్ గా పనిచేసిన కంచర్ల గోపన్న ,రామదాసుగా ప్రసిద్ధి చెందిన శ్రీరామభక్తుడు. ఆయన శాసనం కారణంగా భద్రాచలంలో నేటికి ఆరుబయట శ్రీ సీతారాముల కళ్యాణం జరుగుతుంది. శ్రీరాముని వైకుంఠ రామునిగా కూడా పిలుస్తారు. అవతార సమాప్తి తర్వాత వైకుంఠం వెళ్ళిన శ్రీరామమూర్తి తన భక్తుడైన భద్రాద్రి (భద్రుడు అనే పర్వతం) కొరకు భూలోకం తిరిగి వచ్చి నివాసమేర్పరుచుకుని భద్రాద్రి రాముడయ్యాడు.

## వైశాఖము (హనుమత్ జయంతి)

ఆంజనేయస్వామి పుట్టినరోజు. ఆరోజు దేవాలయాలలో విశేషపూజలు, ఆకుపూజ, వడమాల,అభిషేకాలు మొదలగు విశేషపూజలు నిర్వహిస్తారు.